

జీహెచ్‌ఎంసీ సిబ్బందికి చీరలు పంపిణీ చేస్తున్న గవర్నర్

సేవాభావంతో ముందుకు సాగాలి

● స్వామి మునీశ్వరానంద

కవాడిగూడ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సేవాభావంతో ముందుకు సాగినప్పుడే సమాజంలో అన్ని వర్గాల ప్రజల ఆదరణ లభిస్తుందని భారత్ సేవాశ్రమ్ హైదరాబాద్ శాఖ అధ్యక్షుడు స్వామి మునీశ్వరానంద అన్నారు. శుక్రవారం 100 మంది జీహెచ్‌ఎంసీ సిబ్బందికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా చీరలు పంపిణీ చేశారు. జీహెచ్‌ఎంసీ కార్మికులకు అండగా ఉండటానికే ఇలాంటి కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన చెప్పారు. రాష్ట్ర గవర్నర్ కూడా సంతోషం వ్యక్తం చేశారని ఆయన తెలిపారు. సేవా భావంతో మరింత ముందుకు సాగుతామని పేద ప్రజలను ఆదుకోవడానికి తమవంతు సహకారం అందిస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఆశ్రమ కార్యదర్శి స్వామి వెంకటేశ్వరానంద, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐపీకేఎస్ నేతలు ప్రభాకర్, రంగారెడ్డి

రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

● ఏఐపీకేఎస్ నేతల డిమాండ్

నల్లకుంట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీకేఎస్) నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో ఏఐపీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కెచ్చెల రంగారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వి.ప్రభాకర్, సహాయ కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న దేవరాం, ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య హాజరై రాష్ట్రంలోని అనేక సమస్యలను, రైతాంగ అంశాలపై చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీ సక్రమంగా అమలు చేయలేదని ఆరోపించారు. అర్హులైన రైతుల్లో సగం మందికి అపివేసిందని విమర్శించారు. రైతు భరోసా ప్రారంభించాలని, పంటల బీమా, రైతు బీమాకు ప్రీమియం ప్రభుత్వమే చెల్లించి వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లపై ఈ నెల 25 నుంచి 31వ తేదీ వరకు జిల్లా వ్యవసాయ అధికారుల కార్యాలయాల ఎదుట ఆందోళన నిర్వహించనున్నట్లు తెలిపారు.

మ్యాన్‌హోల్‌కు మరమ్మతు చేయాలి

● బీజేవైఎం సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్

అంబర్‌పేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట డివిజన్ ప్రేమ్‌నగర్‌లో కుంగిపోయి ప్రమాదకరంగా మారిన మ్యాన్‌హోల్‌కు వెంటనే మరమ్మతులు చేపట్టాలని బీజేవైఎం సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్ అధికారులను డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మ్యాన్‌హోల్ కుంగిపోయిందని స్థానికులు ఆయనకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన శుక్రవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించి సంబంధిత అధికారులు స్పందించి ప్రజలకు ప్రమాదకరంగా మారిన మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు పాల్గొన్నారు.



కుంగిన మ్యాన్‌హోల్‌ను పరిశీలిస్తున్న యశ్వంత్



చల్లా నర్సింహారెడ్డిని సన్మానిస్తున్న తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు నర్సయ్య తదితరులు

చల్లా నర్సింహారెడ్డికి సన్మానం

రాంనగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన చల్లా నర్సింహారెడ్డిని తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం. నర్సయ్య ఆధ్వర్యంలో శుక్రవారం మాసాబ్‌ట్యాంక్‌లోని ఆయన కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ జన సమితి బీసీ సెల్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు జశ్వంత్ కుమార్, ప్రధాన కార్యదర్శి వి. రాంచందర్, నాయకులు జైపాల్‌రెడ్డి, లక్ష్మణ్, సురేష్ కుమార్, సుధాకర్, రవి, నటరాజ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టాఫీస్ పథకాలను వివరిస్తున్న కార్పొరేటర్ పావని

పోస్టాఫీస్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పోస్టాఫీస్ పథకాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ అన్నారు. తపాలాశాఖ వారి ఆధ్వర్యంలో డీసీడీపీ (డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్) కార్యక్రమాన్ని శుక్రవారం డివిజన్‌లోని గాంధీనగర్ జనప్రియ అబోడ్స్ అపార్ట్‌మెంట్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ మాట్లాడుతూ పోస్టాఫీసు ద్వారా అమలు కాబడుతున్న పథకాలు, సేవల ద్వారా ప్రజలు ఆర్థిక సాధికారత పెంపొందించుకుని జీవనశైలిని అభివృద్ధి చేసుకోవచ్చునన్నారు. పోస్టల్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై దాడి చేసిన ఇద్దరికి నెల రోజుల జైలు

రాంనగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని భోలక్‌పూర్‌లో నివాసం ఉంటున్న ఫాయాజ్ అహ్మద్(20), మహ్మద్ బాబా షరీఫ్ (22)లు స్థానికంగా ప్రజలపై అకారణంగా దాడిచేసి గొడవలు చేస్తున్నారు. దీంతో బాధితులు ముషీరాబాద్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు వారిద్దరిని శుక్రవారం అరెస్ట్ చేసి నాంపల్లిలో 5వ సెషన్ కోర్టు ముందు హాజరుపరిచారు. మేజిస్ట్రేట్ సత్యనారాయణ వారికి నెల రోజుల జైలు శిక్ష విధించారని సీఐ రాంబాబు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం

కవాడిగూడ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్పత్రి ఎదురుగా ఉన్న ఈఎస్ఐ ఆస్పత్రి వద్ద దాదాపు యాభై సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గాంధీనగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించినట్లు గాంధీనగర్ సీఐ రాజు తెలిపారు. మృతుడు బిక్షాటన చేసే వాడని ఆచూకీ తెలిసిన వారు గాంధీనగర్ పీస్‌లో సమచారం అందించాలని కోరారు.



సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలి

● ఎంపీ ఆర్. కృష్ణయ్య

రాంనగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సంక్షేమ హస్టళ్లు, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని, ప్రస్తుతం ఉన్న విద్యార్థుల మెస్ చార్జీలను రూ.1500 నుంచి 4 వేలకు పెంచాలని రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని కోరారు. తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కూరెళ్ల మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థి, నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి నవంబర్ 22న వరంగల్‌లో నిర్వహించే విద్యార్థి యుద్ధభేరి మహాసభ పోస్టర్‌ను శుక్రవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఎంపీ ఆర్.కృష్ణయ్య ఆవిష్కరించి మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలలకు పూర్తి స్థాయి ప్రిన్సిపాళ్లను నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంక్షేమ హస్టళ్లు, గురుకులాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలన్నారు. ప్రభుత్వ కాలేజీలలో సీట్ల సంఖ్యను పెంచాలన్నారు. సంక్షేమ హస్టళ్లలో ఖాళీగా ఉన్న వార్డెన్, వర్కర్స్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు మహేష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా కేంద్రాలలో ప్రభుత్వ డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ కాలేజీలను ఏర్పాటు చేయాలన్నారు.

కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, మోదీ రాందేవ్, హేమంత్, సి. రాజ్‌కుమార్, సత్యనారాయణ, జి. శ్రీనివాస్, ప్రసాద్, సతీష్, గోవిందరాజు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో విద్యార్థి యుద్ధభేరి మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ ఆర్. కృష్ణయ్య

ఉద్యమకారుల డిమాండ్లను సీఎం దృష్టికి తీసుకెళ్తా

● ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం

రాంనగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల డిమాండ్లను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరాం తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల డిమాండ్లను పరిష్కారం చేయాలని కోరుతూ తెలంగాణ ఉద్యమకారుల సమితి చైర్మన్ సుల్తాన్ యాదగిరి ఆధ్వర్యంలో ఉద్యమకారులు శుక్రవారం చిక్కడపల్లిలోని కార్యాలయంలో కోదండరాంను కలిసి తమ డిమాండ్లను విన్నవించారు. ఈ సందర్భంగా సుల్తాన్ యాదగిరి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలను ఆదుకోవాలని, ఉద్యమకారులకు గుర్తింపు కార్డులను జారీ చేయాలని, 200 గజాల స్థలం ఇవ్వాలని, ప్రభుత్వ పథకాల అమలులో ప్రాధాన్యం కల్పించాలని, ప్రభుత్వ నామినేటెడ్ పదవులలో అవకాశం కల్పించాలని కోదండరాంకు విన్నవించారు. ఉద్యమకారుల డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తానని కోదండరాం హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి తుమ్మల ప్రతాప్‌రెడ్డి, నాయకులు బి.రంగారెడ్డి, బత్తుల సోమన్న, వెంకటస్వామి, చంద్రన్న ప్రసాద్, డప్పు స్వామి, చంద్రుడు, స్వరూప, అరుణ, సునీత, అంజలి, అంజయ్య, మాదాసు శ్రీనివాస్, అశోక్‌సింగ్, శంకర్‌రావు, తుల్జారెడ్డి, లత తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ కోదండరాంను కలిసి డిమాండ్లను తెలియజేస్తున్న తెలంగాణ ఉద్యమకారుల సమితి చైర్మన్ సుల్తాన్ యాదగిరి



ఎమ్మెల్సీ అమేర్ అలీ ఖాన్‌ను సత్కరిస్తున్న విరాహత్ అలీ, మాజీద్, శంకర్‌గౌడ్, యాదగిరి తదితరులు

జర్నలిస్టులకు చేయూతనందిస్తా

● ఎమ్మెల్సీ అమేర్ అలీఖాన్

బర్కత్‌పుర, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జర్నలిస్టులకు ఎలాంటి ఆపద వచ్చినా తనవంతు చేయూతనందిస్తానని ఎమ్మెల్సీ అమేర్ అలీఖాన్ హామీ ఇచ్చారు. జర్నలిస్టుల గొంతుకను నిలబడతానని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల ఎమ్మెల్సీ బాధ్యతలు చేపట్టిన అమేర్ అలీఖాన్‌కు సన్మాన కార్యక్రమాన్ని టీయూడబ్ల్యూజే, హెచ్‌యూజేల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. ఎమ్మెల్సీ అమేర్ అలీఖాన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో వారు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు 50 ఏళ్లుగా తమ కుటుంబానికి జర్నలిస్టు యూనియన్‌తో సంబంధం ఉందన్నారు. తాత, తండ్రి యూనియన్ కార్యక్రమాలలో క్రియాశీలకంగా వ్యవహరించారని ఆయన గుర్తుచేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన టీయూడబ్ల్యూజే అధ్యక్షుడు కె. విరాహత్ అలీ మాట్లాడుతూ అమేర్ అలీ ఖాన్ ఎమ్మెల్సీగా నియామకం కావడం ఉర్దూ జర్నలిజానికి దక్కిన గౌరవంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రెస్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా మాజీ సభ్యులు ఎం.ఏ.మాజీద్, టీయూడబ్ల్యూజే కార్యదర్శి వరకాల యాదగిరి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేష్, హెచ్‌యూజే అధ్యక్షుడు శిగా శంకర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శ అమిత్ షౌకత్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో రేపు కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్ ప్రారంభం

బర్కత్‌పుర, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): యువతను సన్మార్గంలో నడిపించడానికి బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్ పలు కార్యక్రమాలు చేపడుతుందని ఆ సంస్థ ప్రతినిధులు సిస్టర్ అంజలి, డాక్టర్ ఉమారాణి, ఏఎల్. రజనీ, బీకే కవిత, బీకే అరుణ్ తెలిపారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 25న గచ్చిబౌలిలో కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు ఈ ప్రాజెక్ట్‌ను తెలుగు రాష్ట్రాల ముఖ్య మంత్రులు రేవంత్‌రెడ్డి, చంద్రబాబునాయుడు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభిస్తారని తెలిపారు. రాష్ట్ర మంత్రులు దామోదరం రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పాల్గొంటారని వారు తెలిపారు. సహజ వ్యవసాయ పద్ధతులు, రైతుల ఆత్మహత్యల నివారణ, పర్యావరణ పరిరక్షణ, మానసిక ఆరోగ్యం తదితర సామాజిక కార్యక్రమాలు నిర్వహించడమే ప్రాజెక్ట్ లక్ష్యమని వారన్నారు.

అర్హులు సీఎంఆర్ఎఫ్ పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

చిక్కడపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అర్హులైనవారు సీఎంఆర్ఎఫ్ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం అడిక్‌మెట్, ముషీరాబాద్ డివిజన్లకు చెందిన 11 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ పథకం కింద మంజూరైన రూ. 3.37 లక్షల చెక్కులను ఎమ్మెల్యే గోపాల్ వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయనిధి పథకం పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాకేష్‌కుమార్, శంకర్‌ముదిరాజ్, మీడియా ఇన్‌చార్జ్ ముచ్చకుర్తి ప్రభాకర్, అస్లామ్, ఖదీర్, దీన్‌దయాళ్‌రెడ్డి, భాస్కర్, బల్వంత్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

● గాంధీనగర్ సబ్‌డివిజన్ ఏసీపీ మొగులయ్య

కవాడిగూడ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాబోయే గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా గణేశ్ మండప నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని గాంధీనగర్ సబ్‌డివిజన్ ఏసీపీ మొగులయ్య మండప నిర్వాహకులకు సూచించారు. అనుమతి లేకుండా గణేశ్ మండపాలు ఏర్పాటు చేసినా, డీజేలు ఏర్పాటు చేసినా నిర్వాహకులపై కఠిన చర్య లు తప్పవని ఆయన హెచ్చరించారు. గాంధీనగర్ సబ్‌డివిజన్ పరిధిలోని గాంధీనగర్, దోమలగూడ, లేక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గణేశ్ మండప నిర్వాహకులతో శుక్రవారం కవాడిగూడ డివిజన్‌లోని బండమైసమ్మనగర్ కమ్యూనిటీ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గాంధీనగర్ ఏసీపీ మొగులయ్య మాట్లాడుతూ రాబోయే గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గతంలో అనుమతి తీసుకున్న వారు ఈ సారి నిర్ణీత సమయంలో నిర్వాహకులు ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా దరకాస్తుచేసుకొని అనుమతులు పొందాలని సూచించారు. అనుమతి లేకుండా రోడ్లపై, చౌరస్తాలు. అనుమతి లేకుండా బస్తీలలో గణేశ్ మండపాలు ఏర్పాటుచేస్తే చర్యలు తప్పవన్నారు. ప్రతి మండపం వద్ద నిర్వాహకులు తప్పనిసరిగా ఉండాలని, స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.

సమావేశానికి దోమలగూడ ఇన్‌స్పెక్టర్ దొంతి రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షత వహించగా గాంధీనగర్ సీఐ రాజు. లేక్ పోలీస్‌స్టేషన్ సీఐ వెంకట్ రెడ్డి, ఎస్ఐలు హనుమంతు, నాయక్‌లతో పాటు పోలీసు సిబ్బంది, గణేశ్ మండప నిర్వాహకులు పాల్గొన్నారు.



గణేష్ మండప నిర్వాహకుల సమావేశంలో మాట్లాడుతున్న గాంధీనగర్ ఏసీపీ మొగులయ్య



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ గంగాధర్

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమమే ధ్యేయం

● రాష్ట్ర భవన నిర్మాణ కార్మికుల సంక్షేమబోర్డు కార్యదర్శి

చిక్కడపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు కార్మికశాఖ అదనపు కమిషనర్, తెలంగాణ భవన నిర్మాణ, ఇతర నిర్మాణ రంగాల సంక్షేమ బోర్డు కార్యదర్శి డాక్టర్ ఇ. గంగాధర్ తెలిపారు. భవన నిర్మాణ కార్మికులకు మరింత విలువైన సేవలు అందించే క్రమంలో భాగంగా బయోమెట్రిక్, ఐరీస్ పరికరాలు అసిస్టెంట్ లేబర్ అధికారులు(ఏఎల్‌వో)కు అందించే కార్యక్రమం శుక్రవారం మధ్యాహ్నం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని తెలంగాణ కార్మిక శాఖ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించారు. భవననిర్మాణ సంక్షేమ బోర్డులో పేర్లు నమోదై ఉన్న కార్మికుల పూర్తి వివరాలు మరింత సులువుగా, పూర్తిస్థాయిలో నమోదు చేసే అంశంలో భాగంగా ఈ పరికరాలను ఏఎల్‌వోలకు అందజేశారు. ఈ సందర్భంగా డా. గంగాధర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన వివరించారు. ఆధార్ కార్డు నంబర్ ఇతర పూర్తి వివరాలు తమ సభ్యత్వ దరఖాస్తులో నమోదు చేసుకోవడానికి భవన నిర్మాణ కార్మికులు నేరుగా ఏఎల్‌వోలను కలిస్తే వారి వివరాలు తాము అందజేసిన పరికరాల ద్వారా సులువుగా యాడ్ చేస్తారని వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు బాలుర అదృశ్యం

తిరుమలగిరి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ తిరుమలగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని టీచర్స్ కాలనీలో కాకినాడ జిల్లా నుంచి ఉపాధి కోసం వచ్చిన కుటుంబం నివసిస్తుంది. కుమారుడిని స్కూల్‌కి వెళ్లమని తల్లి మందలించడంతో బాలుడు (13) ఇల్లు వదిలి పారిపోయాడు. కుమారుడు కనిపించడంలేదని బాలుడి తల్లి విజయ తిరుమలగిరి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మూడు గంటల వ్యవధిలోనే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో బాలుడి ఆచూకీ కనుగొని బాలుడిని తల్లివద్దకు చేర్చారు.



బాలుడిని తల్లి వద్దకు చేర్చిన పోలీసులు

బాలానగర్‌లో

బాలానగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న బాలుడు తన తల్లి లక్ష్మి ఆరోగ్యం బాగోలేదని ఇంట్లో పడుకోవడంతో బాలుడు ఇంటి బయట ఆడుకుంటూ వీధి చివర బస్సు ఎక్కి తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో దిగి ఏడుస్తూ కనిపించాడు. తిరుమలగిరి పోలీస్ పెట్రోల్ వాహనం వారు బాలున్ని స్టేషన్‌కి తీసుకువచ్చి, ఆధారాలు సేకరించి చైల్డ్ హెల్ప్‌లైన్‌కి తెలియజేయడంతో బాలుడు బాలనగర్‌లో ఉంటున్నట్టు తెలిసింది. పోలీసులు బాలుడిని తల్లికి అప్పగించారు.

డ్రంకెన్ డ్రైవ్ నిందితులకు జరిమానా

తిరుమలగిరి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇన్‌స్పెక్టర్ మధుబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 11 మందిని పట్టుకున్నారు. వీరిని శుక్రవారం నాంపల్లి కోర్టులో హాజరుపరచగా జరిమానా విధించిందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ విజయభాస్కర్ తెలిపారు. విద్యానగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని అడిక్‌మెట్, బ్లడ్‌బ్యాంక్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 11.30, నారాయణగూడ పరిధిలోని బాగ్‌లింగంపల్లి, నెహ్రూనగర్ తదితర ప్రాంతాల్లో 11.30 నుంచి 1 వరకు, బతుకమ్మకుంట పరిధిలోని పాముల బస్తీ, మల్లన్న టెంపుల్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి 4.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.



ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

● ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గాంధీనగర్ డివిజన్ అరుంధతీనగర్ బస్తీలోని మైసమ్మ దేవాలయంలో మైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ నేటి బిజీ యుగంలో భక్తిభావనతో ఉంటేనే మనసుకు ప్రశాంతత దొరుకుతుందన్నారు. ఈ సందర్భంగా గణపతిపూజ, కుంబాభిషేకం, తీర్థప్రసాద వితరణ, మధ్యాహ్నం అన్నదానం చేశారు. కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్, ముఠా జైసింహ, రాకేష్, బాబ్జి, న్యాయవాది శ్రీనివాస్‌గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ తదితరులు

జనాభా ప్రాతిపదికన బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి

● ఎర్ర సత్యనారాయణ

రాంనగర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు తీర్పు, బీసీ కమిషన్, వెనుకబాటుతనం వంటి అంశాలతో సంబంధం లేకుండా జనాభా ప్రాతిపదికన బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో బీసీ రిజర్వేషన్ల అమలు అంశంపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ప్రకారం జనాభా ప్రాతిపదికన బీసీ రిజర్వేషన్లు, కులగణన ప్రభుత్వం చేయకుండా బీసీలను మరోసారి మోసం చేయడానికి కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తుందన్నారు. స్థానిక సంస్థలలో 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతనే ఎన్నికలు జరపాలని, లేనిపక్షంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం పక్షాన న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు నందగోపాల్, సతీష్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యా సంస్థలను సందర్శించిన స్పెషల్ ఆఫీసర్

ముషీరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌లోని ప్రభుత్వ విద్యా సంస్థలను శుక్రవారం అమ్మ ఆదర్శ పాఠశాలల స్పెషల్ ఆఫీసర్ రమేష్ తదితరులు సందర్శించారు. ముషీరాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా సరైన సమయానికి భోజనం అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సదానంద్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ సూపర్‌వైజర్ తిరుమల, బాపూజీనగర్ అంగన్‌వాడీ టీచర్ ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన అమ్మ ఆదర్శ పాఠశాలల స్పెషల్ ఆఫీసర్ రమేష్



ముషీరాబాద్‌లో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి డాక్టర్ మనోజ్ రెడ్డి తదితరులు

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

● వైద్యాధికారి డాక్టర్ మనోజ్ రెడ్డి

ముషీరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ) వైద్యాధికారి డాక్టర్ మనోజ్ రెడ్డి అన్నారు. శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని ముషీరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. నీటి నిలువలు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ ఏఎన్ఎం విజయ కుమారి, ఆశా వర్కర్లు, మలేరియా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కుషాల్ గౌడ్

ముషీరాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు కుషాల్ గౌడ్ బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమితులయ్యారు. ఆయనకు బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ శుక్రవారం నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ముషీరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కుషాల్ గౌడ్ మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. తనపై నమ్మకం ఉంచి పదవీ బాధ్యతలు అప్పగించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.



కుషాల్ గౌడ్



మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలని కోరుతూ పీఓడబ్ల్యూ, పీవైఎల్ సంస్థల ఆధ్వర్యంలో రాంనగర్ చౌరస్తాలో నిరసన చేస్తున్న నేతలు

-రాంనగర్, ఆంధ్రజ్యోతి